# పుష్పమాల

శ్రీమతి బి. సరోజనీదేవిగారు

పేరుగల వకీలు ప్రసాదరావుగారు. ఆయనకు చారుశీల ఒక్కర్తే కూతురు 8 సం॥ ప్రాయముగలది. చిన్నదయినప్పటికి ఇతరులకష్ట, సుఖములు బాగుగా గుర్తుఎరిగిన బాలిక. అందాలచిందేముఖము. ప్రసాదరావుగారి చెల్లెలుకొడుకు 12 సం॥ బాలుడు వినోద్. చిన్నతనములోనే తల్లి, దండ్రులను కోల్పోయిన అభాగ్యుడు. మేనమామ దగ్గరేవుండి చదువుకొంటున్నాడు. చారుశీల, తన బావను ఎంతో అప్యాయంగా ఆదరించేది. ఇద్దరు ఒకేకంచములోతిని, ఒకేమంచముమీద పండుకొనేవారు. కాని, ప్రసాదరావుగారి భార్యఅయిన కృపామతికి వినోద్ అంటే ఏమిఇష్టములేదు. ఎప్పుడు ఏదో వంకపెట్టి ఆపిల్లవాన్ని సాధించేది. కాని వినోద్ మేనత్త ఎన్నికష్టములుపెట్టినా చారుశీల ముఖము చూచేసరికి అన్నికష్టాలు మర్చిపోయేవాడు. ఆరోజు దసరాపండుగ కృపామతి కూతురికి తలంటిపోసి, క్రొత్తబట్టలు కట్టింది, 'సరస్వతీపూజ చేసుకో, గులాబి పువ్వులు సజ్జలోవున్నాయి తీసుకో' అనిచెప్పి వెళ్లిపోయింది. చారుశీల గులాబిపుష్పాలు అన్నీ పెద్దమాలగా గుచ్చింది. ఇంతట్లోకి వినోద్ వాడినముఖముతో బట్టలు సర్దుకొంటున్నాడు. వినోద్‌నుచూచి చారుశీల మెల్లగా వెనకనించి వెళ్లి అతనిమెడలో ఆదండ నలంకరించి అతని తల చేత్తో పైకి ఎత్తింది. అతని కళ్లంట నీరుచూచి గతుక్కుమన్నది. 'ఛా-అదేమిటి బావా! పండుగరోజు ఏడుస్తున్నావు?' అంటూ కళ్లనీళ్లు తనపరికిణీతో తుడిచింది. 'చారు! ఎంతపనిచేశావు? ఈదండనామెళ్లో నీవువేయవచ్చునా!' 'ఏం బావ చారుశీల నీకు ప్రియమైనదికాదా? పతిపూజచేయుట గృహాలక్ష్ముల ధర్మంకాదా?' 'చారు నీవుచెప్పింది నిజమే. నన్నుయింటినుండి బయటకు వెళ్లిపొమ్మనమని అత్త ఆజ్ఞ?' 'ఆ-ఏమిటిబావా? నిన్ను మా అమ్మ యింట్లోంచి పొమ్మందా? అయితే నేను నీతో వస్తాను.' 'పిచ్చిదానా? చిన్నదానవయినా ఎంత జ్ఞానముంది చారు నేను ఎక్కడున్న అన్యకాంతను చేపట్టను. ఎప్పుడయితే ఈ పుష్పమాల నా మెడలోవేశావో అప్పుడే మన యిద్దరికి వివాహాము అయిపోయింది. ఈమాలపట్టుకొని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఎప్పటికయినా నీవే నాఅర్థాంగివి.' అంటూ ఆమెను దగ్గరకు తీసుకొని కళ్లనీళ్లుతుడిచి వెళ్లిపోయాడు వినోద్.

* * *

చారుశీల యిప్పుడు 16 సం॥ యౌవ్వనవతి వినోద్ వెళ్లిపోయి 8 సం॥ అయింది. ఎక్కడవున్నాడో, ఏమో? పెండ్లిసంబంధాలు చూస్తున్నారు తల్లి, దండ్రులు. కాని చారుశీల ఎవ్వరిని పెండ్లిచేసుకొనుటకు ఒప్పుకొనుటలేదు. చిన్ననాడు వినోద్, 'చారు నిన్నుతప్ప ఎవరిని పెండ్లిచేసుకోను గులాబిమాల సాక్షిగా చెపుతున్నాను' అన్నమాటలు చెవిలో గింగురుమంటున్నాయి. ఒకరోజు తల్లి కూతురుదగ్గరకు వచ్చింది. 'అమ్మాయి ఎన్నాళ్లు పెండ్లిలేకుండ వుంటావు. ఎదిగివున్నపిల్లను యింట్లోపెట్టుకొన్నందుకు అందరు తలోమాటా అంటున్నారు. వినోద్‌ని చేసికొందామని అనుకొంటున్నావు బాగుంది వాడు దరిద్రుడు. అయినా వాడు ఎక్కడకుపోయాడో, నామాటవిని ఇంకొకని చేపట్టి సుఖించు.' 'అమ్మా నేను యింకొక నూతనవ్యక్తిని వివాహముచేసుకోలేను. చేసుకొంటే. బావను చేసుకోవాలి, లేకపోతేనా జీవితంఅంతా బ్రహ్మచారిణిగానే గడుపుతాను. ఇంక నేను'...'చాల్లే ఊరుకో! చారుశీల, ఏమైననుసరే యింకొకసంబంధము నిశ్చయించి నీకు పెండ్లిచేయకతప్పదు' అంటూ కృపామతి జవాబుఅయినా వినకుండా వెళ్లిపోయింది. చారుశీల దుఃఖముతో మెల్లగా గదిలోనికివెళ్లి చిన్నప్పుడు తనపెట్టిలోదాచిన వినోద్ పోటోతీసింది. 'బావా ఎప్పటికయినా మనయిద్దరిహృదయాలు ప్రేమసూత్రంతో బంధింపబడతాయా? హృదయమనే తోటలో జీవనమనేనీరుపోసి, ప్రేమఅనే బీజాలునాటి, ప్రణయమనే కుసుమముల వికసింపజేస్తామా?' అంటూ ఎంతసేపు దుఃఖించిందో ఆఅబల! చారుశీల రోజు, రోజు బెంగచేత కృశించిపోతోంది. మంచంమీదనుండి లేచుటలేదు. ఆ వూరికి క్రొత్తగా డాక్టరువచ్చాడు. ఆయన చాలామంచివాడని తెలిసి ఆయనకోసము బంట్రోతుని పంపించారు. డాక్టరువచ్చి రోగిని పరీక్షచేయుటకు దగ్గరకువచ్చి, థర్మామీటరుతీసి నోట్లో పెట్టుకోమన్నాడు. ఆమె ముఖముతిప్పింది డాక్టరు ఆమె ముఖము తేరిబారిచూచాడు. ఇంక చూడలేకపోయాడు. మందులసంచికూడ అక్కడమర్చిపోయి బయటకు వచ్చేశాడు. నౌకరు సంచిఅతనికారులోపెట్టాడు. మందుకురమ్మనమని చెప్పేసి వెళ్లిపోయాడు. డాక్టరు దయవల్ల చారుశీల ఆరోగ్యవంతురాలయింది. ప్రసాదరావుగారు, భార్యపోరువల్ల కూతురికి సంబంధము నిశ్చయించారు ఈమాట వినేసరికి చారుశీల చాల దుఃఖించింది. తనబావకు ద్రోహంచేస్తున్నామనుకొన్నది. కాని ఏమిచేయగలదు. పెండ్లి మహావైభవముగా చేశారు. కాని పెండ్లికొడుకుని తలఎత్తయినా చూడలేదు ఆమెకు తీవ్రముగా జ్వరమువచ్చేసింది. ఈకారణముచేత పెండ్లికొడుకు వుండకుండా వెళ్లిపోయాడు.

* * *

ఆరోజు దసరాపండుగ క్రొత్తఅల్లుని తీసుకొచ్చారు. చారుశీల మాత్రము గదిలోనుంచి బయటకురాలేదు. అతను తలంటి నీళ్లుపోసుకొని, క్రొత్తబట్టలుకట్టుకొని,

మెల్లిగా చారుశీలగదిలోకి వెళ్లాడు. ఆమె ఒక ఫోటో చేత్తోపట్టుకొని 'బావా సమంగా నీవువెళ్లిపోయి 10 సం॥ అయినది. ఈ దసరారోజుననేకదా నీకంఠమున పూలమాల అలంకరించి నిన్ను నాపతిగాచేసుకొన్నాను? బావా? నాహృదయములో ఇంకొకరికి స్థానంలేదు.' అని యింకా ఏదో అనబోతోంది ఆమె మెడలో గులాబిమాలపడింది, ఆమె త్రుళ్లిపడి అతన్నిచూచి బుఱ్ఱ వంచేసుకొంది. కళ్లనీళ్లు గిర్రునతిరిగాయి, అతను మెల్లగా ఆమెగడ్డముపట్టుకొని 'చారుశీలా నన్నుమర్చిపోయావా? నీబావ వినోద్‌ను' 'ఆ! బావా? నీవేనా?' అంటూ అతనిహృదయముమీద వాలిపోయింది. 'చారు! ఏ దసరారోజునఅయితే ఇద్దరము దుఃఖముతో విడిపోయామో, మళ్లీ ఆ దసరారోజుననే సంతోషముగా కలుసుకొన్నాము. ఆరోజు నీవు నామెడలో పుష్పమాలవేసినప్పుడు నిన్ను నా అర్ధాంగిగా చేసుకొంటానని ప్రతిజ్ఞచేశాను ఈరోజు ఈ పుష్పమాల నీమెడలోవేసి నా ప్రతిజ్ఞ నిలుపుకొన్నాను.' 'బావా నీవు అందుకుసమర్ధుడవే?' 'చారు నీవుమాత్రముకావా? ఆ విషయములో ఇద్దరము సమర్థులమే!'




అరుణ స్త్రీలకు వరప్రసాదం వంటిది. ఇది స్త్రీలకు కలిగే ఋతు సంబంధ వ్యాధులన్నిటిని పారద్రోలి జీవనమునకు ఆనందమును, మాధుర్యమును, సౌరభ్యమును చేకూర్చును.

**ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్, మదరాసు 17.**